క్లుప్తంగా

నీటి విషయంలో రాజకీయం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం : సాగునీటి విషయంలో రాజకీయం తగదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు చుక్కా మల్లేష్, కోటేశ్వరరావు, బసవరాజు అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు గురురాఘవేంద్ర ప్రాజెక్టు రిజర్వాయర్లను పూర్తిగా వదిలేశారని ఆరోపించారు. సాగునీరు పంపిణీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ టీడీపీ ప్రభుత్వానికి లేకపోయిందన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ డైరెక్టర్ సాగునీటి సరఫరా లెక్కలను విశదీకరించారని, అది జీర్ణించుకోలేక గడ్డం నారాయణ రెడ్డిపై టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు.

కూలీ కుటుంబానికి సెంట్రింగ్ యూనియన్ చేయూత



మృతుడు రవి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు: ప్రమాదవశాత్తు నాలుగంతస్తుల బిల్డింగ్ నుంచి కిందపడి మృతి చెందిన సెంట్రింగ్ కూలి హరిజన రవి కుటుంబానికి సెంట్రింగ్ అసోషియేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఎమ్మిగనూరు పట్టణం ఎస్సీకాలనికి చెందిన రవి సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబం పోషించేవాడు. ఇటీవల ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి చనిపోయాడు. మృతుడికి భార్య రత్నమ్మ, నలుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. ఆ కుటుంబంకు సాయపడేందుకు సాటి కూలీలు, మేస్త్రిలు చేయిచేయి కలిపారు. దాతల సహకారంతో అసోసియేషన్ సభ్యులు వెంకట్రాముడు, ఉమాపతిరెడ్డి, శ్రీకాంత్, జావిద్, బుడ్డబాషా శనివారం రవి భార్య రత్నమ్మకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



సీఐ గంగాధర్

గోనెగండ్ల: అనుమతి లేకుండా ఇసుక, ఎర్ర మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎవరికైనా ఇసుక అవసరమైతే అధికారుల అనుమతి తీసుకుని రీచ్‌ల నుంచి తెచ్చుకోవాలని తెలిపారు. అలాగే ఎర్రమట్టి అవసరమైన వారు సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి యాజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఆదోనివాసికి సేవారత్న అవార్డు

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన సంఘ సేవకుడు, ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) అధ్యక్షులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్‌గుప్తకు బెంగళూరుకు సోమలరాజు ఫౌండేషన్ భారతసేవా రత్న జాతీయ అవార్డుతో సత్కరించింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలలో నిస్వార్థంగా సేవలు అందించిన 35 మంది స్వచ్ఛందసేవకులకు శనివారం బెంగళూరులో ఫౌండేషన్ నిర్వాహకులు శివరాజు అవార్డును ప్రదానం చేశారు.

విద్యార్థుల ఆశలపై నీళ్లు



మెడికల్ కళాశాల మంజూరుతో ఆదోని రూపురేఖలు మారుతాయని ఆశించాం. కూటమి ప్రభుత్వం కళాశాల నిర్మాణాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇవ్వడం బాధాకరం. నా కుమారుడు గౌతమ్‌కృష్ణకు 590 మార్కులు వచ్చాయి. అయినా సీటు కన్ఫర్మ్ కాలేదు. తెలంగాణలో 500 మార్కులు దాటితే సీటు లభిస్తుంది. ఇక్కడ 550 మార్కులు దాటినా సీటు రావడం కష్టమే. మెడికల్ సీట్లకు ఏపీలో పోటీతత్వం పెరిగింది. వైద్య విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. కానీ ప్రభుత్వం మాత్రం విద్యార్థులను నిరుత్సాహపరుస్తోంది. వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. – కృష్ణమూర్తి, విద్యార్థి తండ్రి



వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుంది



ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారనుంది. నూతన మెడికల్ కళాశాలల్లో తరగతులను ప్రారంభిస్తే అదనంగా సీట్లు పెరిగి విద్యార్థులకు సీటు దొరికేది. చాలా మంది పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నా కూతురు బీకే కుందనసాయి లాంట్‌టర్మ్ కోచింగ్‌కు పంపించాను. ఏడాది పాటు సమయం వృథాతోపాటు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. వైద్య సీట్లను తగ్గించి ప్రైవేట్ పరం చేయడం తగదు. ప్రభుత్వం పునరాలోచించాలి. – ఎ.బసవరాజు, విద్యార్థి తండ్రి

రాజీయే రాజమార్గం

- జడ్జి పి.జె.సుధ
- జాతీయ లోక్ అదాలత్‌లో 199 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: రాజీయే రాజ మార్గమని జడ్జి పి.జె.సుధ తెలిపారు. రాజీ అయితే ఓడినట్లు కాదని, ఇద్దరూ గెలిచినట్లేనని ఆమె అభిప్రాయపడ్డారు. శనివారం జిల్లా రెండో అదనపు కోర్టులో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పి.జె.సుధ మాట్లాడారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. అనంతరం 199 కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైనట్లు చెప్పారు. రెండో అదనపు జిల్లా కోర్టు పరిధిలో 35 కేసులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 7, ప్రిన్సిపాల్ సివిల్ కోర్టులో 8, మొదటి అదనపు జూనియర్ కోర్టులో 32 , రెండో అదనపు జూనియర్ కోర్టులో 17, పీఎల్‌సీ 8, ఎస్టీసీ అడ్మిషన్స్ 83, సీసీ అడ్మిషన్స్ 9 కలిపి మొత్తం 199 కేసులు రాజీమార్గం ద్వారా లోక్‌అదాలత్‌లో పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి అర్చన, మొదటి అదనపు సివిల్ జడ్జి లీలాసాయి సుభాష్, కక్షిదారులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్టులో కేసులు విచారిస్తున్న జడ్జి

లోక్ అదాలత్‌లో 55 కేసులు పరిష్కారం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 55 కేసులను జడ్జి కుమారి ఏవీఎస్ శ్రీవల్లి పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో ఏపీపీ గోపాలకృష్ణ, లోక్‌అదాలత్ మెంబర్ విమల, న్యాయవాదులు దామోదర్‌రెడ్డి, పీఎంఆర్ ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: సెలవు దినాల్లో తరగతులు నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఓ డివిజన్ సెక్రటరీ శివ డిమాండ్ చేశారు. శనివారం కార్పొరేట్ విద్యాసంస్థల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ధనరాజు, గణేష్, కేశవ, రాఘవేంద్ర, తిరుమల పాల్గొన్నారు.

రమణీయం.. అంజన్న రథోత్సవం






ప్రత్యేక పూల అలంకరణలో దర్శనమిస్తున్న రణమండల ఆంజనేయస్వామి, స్వామి రథోత్స దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. శ్రావణమాస 41 రోజుల దీక్ష శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు పంచామృతాభిషేకం, వివిధ రకాల పూలు, గజమాల, ఆకుపూజ, సింధూరసేవ, తులసీమాల, నైవేద్యం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించారు. కాగా ఈనెల 17న మహామండలి పూజ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆంజనేయుడికి విశేష పూజలు



కోసిగి: స్థానిక కడపాలెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పవన సుతుడికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీరాములు, శ్రీనవాసులు స్వామి వారికి వేకువజాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, మహామంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తాదులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, సింధూరాభిషేం తదితర పూజలు జరిపించారు. అలాగే కౌతాళంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కౌతాళం: పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జైభీమ్ అధ్యక్షుడు, కౌతాళం మాజీ సర్పంచ్ అవతారం డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే పునరావృతమవుతున్నాయన్నారు.

దాడులను సహించేది లేదు

పెద్దకడబూరు : దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) మండల అధ్యక్షుడు ఎంపీ యువరాజ్ మాదిగ, నాయకులు ముక్కరన్న, అర్లప్ప హెచ్చరించారు. మండలంలోని కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి జరిగిన దాడిలో గాయపడిన గోవిందమ్మను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో శనివారం వారు పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పశుపోషణలో ముందుండాలి



పాడి రైతులకు పశుగ్రాసం విత్తనాలు, మినరల్ మిక్సర్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : వ్యవసాయంతో పాటు పశుపోషణలో అభివృద్ధి సాధించి జీవనోపాధులు పెంచుకోవాలని పశు వైద్యుడు వికాస్‌తేజ అన్నారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డీప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాడి పశువుల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బర్రెలు, ఆవుల్లో రోగనిరోధకశక్తి తగ్గి పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాల ఉత్పత్తిని మెరుగుపడాలని పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్సర్, కోఫ్స్ 32రకం పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నందవరం: విద్యార్థినులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఎన్‌ఎం అన్నమ్మ, విజయ మహిళా మండలి అవుట్ రీచ్ కార్యకర్త హసీనా బేగం సూచించారు. శనివారం మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. యుక్త వయస్సులో వచ్చే శారీరక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని మాట్లాడారు. విద్యాభివృద్ధికి చేసిన సేవలే వారికి అవార్డులు తెచ్చిపెట్టాయన్నారు. మరింత బాధ్యతతో పని చేసి మరిన్ని అవార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు గోకారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులకు పూలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆదోని టౌన్: విజయవాడ వరద బాధితుల ఇళ్లను శుభ్రం చేసి వచ్చిన స్థానిక పారిశుధ్య కార్మికులను శనివారం తిరిగి వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవ అధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు మధుబాబు, చలపతి సన్మానించారు. పారిశుధ్య కార్మికులు ఆదోనికి చేరుకోగానే వారిపై పూలు చల్లి స్వాగతం పలికారు.

నేడు జోనల్‌స్థాయి ఆటల పోటీలు

ఆదోని అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జోనల్‌స్థాయి ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నట్లు క్లబ్ పట్టణ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. 22న ఆర్ట్స్ కళాశాలలో అవుట్‌డోర్ గేమ్స్ ఉంటాయన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మరింత సమాచారం కోసం 9885212151 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి సైఫుల్లా, ఆర్గనైజర్ షాబీర్‌అహ్మద్, సభ్యులు జీవన్‌సింగ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

ఆదోని సెంట్రల్: విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనాలోచిత నిర్ణయాలతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దని, ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో వలంటీర్లను నియమించాలన్నారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే పరిమితం చేయాలన్నారు. పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని కోరారు. 12వ పీఆర్సీ ఆలస్యమవుతుండటంతో 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు సి.నాగరాజు, బి.వెంకటేశ్వర్లు, బి.సుంకన్న, బి.నాగరాజు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి



డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: దళితులపై దాడులను అరికట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గుండాల ఈశ్వరయ్య, ఆంధ్రయ్య, బండారి హనుమంతు, ఆనంద్‌చైతన్య, రెడ్డిపోగు భాస్కర్ పేర్కొన్నారు. పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దాడికి గురైన గోవిందమ్మను శనివారం ప్రభుత్వాస్పత్రిలో నాయకులు పరామర్శించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గోవిందమ్మపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వాస్పత్రిలో గోవిందమ్మను ఆదోని డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకుల రవికుమార్, ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణ పరామర్శించారు.

కొనసాగుతున్న స్టాఫ్‌నర్సుల ఆందోళన

ఆదోని టౌన్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులో స్టాఫ్‌నర్సుల ఆందోళన శనివారంతో మూడో రోజుకు చేరుకుంది. ఉదయం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి, స్త్రీల, చిన్నపిల్లల ఆస్పత్రి వద్ద వేర్వేరుగా స్టాఫ్‌నర్సులు ఆందోళన చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. 15 నుంచి 20 యేళ్లుగా తాము ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, తమ సేవలను ప్రభుత్వం గుర్తించకుండా తమ స్థానంలో 18 నెలలు శిక్షణ పూర్తి చేసిన కొత్త స్టాఫ్ నర్సులను తీసుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

నిందితుల అరెస్ట్

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి దళిత మహిళపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నిందితుల్లో కొందరు చాకలి నాగరాజు, హుసేని, రాముడు, భీమరాజును శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని, వారిని ఆదోని రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట శనివారం హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు. నిందితుల్లో మిగిలిన వారిని చాకలి భూలక్ష్మి, నరసమ్మ, లక్ష్మి, పెద్ద రంగమ్మ, గుండమ్మ శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు వివరించారు. దాడిలో పాల్గొన్న నిందితులందరినీ అరెస్టు చేశామన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

ఘనంగా హిందీ దివస్



ప్రిన్సిపాల్ సంజన్నను సన్మానిస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హిందీ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. హిందీ భాష పుట్టుక, దాని ప్రయోజనాలను గురించి హిందీ అధ్యాపకులు శ్రీనివాసులు విద్యార్థులకు వివరించారు. హిందీ సబ్జెక్టులో ప్రతిభ చాటిన మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రిన్సిపాల్ సంజనన్నను, హిందీ అధ్యాపకులు శ్రీనివాసులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోవిందరాజులు, వేదావతి, చిట్టి ప్రసాద్, రాజేశ్వరి, కాంతమ్మ, ప్రభావతి, బాబు,సూరిబాబు, రంగన్న, ఈరన్న పాల్గొన్నారు.



హిందీ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు

కౌతాళం: హిందీభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయిని ముంతాజ్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ముందుగా హిందీ కవుల చిత్రపటాలకు విద్యార్థులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగ్రుతం చేసి ఏకతాటిపై నడిపేందుకు ఉపయోగపడిన భాష హిందీ అని చెప్పారు. అనంతరం మంతాజ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, కార్యదర్శి మైనూద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



వరద బాధితుల సహాయార్థం సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్: విజయవాడ వరద బాధితులకు పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ బియ్యాన్ని సేకరించి చేయూతనందించింది. పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చేయి చేయి కలుపుదాం మన వంతు సహాయాన్ని అందిద్దాం కార్యక్రమంలో భాగంగా సభ్యులు క్రిష్ణ, సురేష్, పెద్దయ్య, మనోహర్, ఎర్రన్న, సందీప్, ప్రవీణ్, రంగస్వామి, రమేష్, పవన్, రవి, రాజేష్, భరత్ తదితరులు నందవరం, కలుగొట్ల గ్రామాల్లో ఇంటింటికి తిరిగి 10 సంచుల బియ్యాన్ని సేకరించారు. శనివారం మల్లెల గ్రూపు అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజుకు అందజేశారు. ఈనెల 17న విజయవాడ వరద బాధితుల కోసం బియ్యం, నిత్యవసర సరుకులను తీసుకెళుతున్నట్లు ఆయన తెలిపారు.

వరద బాధితులకు సాయం



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న రాఘవేంద్ర కాలనీ వాసులు

ఎమ్మిగనూరురూరల్: విజయవాడ వరద బాధితుల కోసం శనివారం రాఘవేంద్ర కాలనీకి చెందిన వినాయక యువక మండలి సభ్యులు బాబు, అంబులెన్స్‌బాషా, మెకానిక్ వీరేష్, నవీన్, హోటల్ వీరేష్, షాదిక్, అంగడి వీరేష్, చాకలి వీరేష్, పవన్ సేకరించిన నిత్యావసర సరుకులను మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, జీపీ పరమేష్‌లకు అందజేశారు. వరద సాయం చేసేందుకు కులమతాలకు అతీతంగా యువకులు ముందుకొచ్చి నిత్యావసర సరుకులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు.